క్లుప్తంగా

నేడు ఇళ్ల స్థలాల కోసం అర్జీల సమర్పణ



లక్ష్మీపురం: పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పట్టణాల్లో రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు అందజేయనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. పేదలంతా ఉదయం 10 గంటలకు శంకర్ విలాస్ సెంటర్‌కు చేరుకోవాలని ఆయన కోరారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు నాయుడు పట్టణంలోని నిరుపేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లోని నిరుపేదలకు మూడు సెంట్లు, ఇంటి నిర్మాణానికి నాలుగు లక్షల రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చారని, కానీ అధికారంలో కొచ్చి ఏడు నెలలు గడిచినా నెరవేర్చలేదని తెలిపారు. సీపీఐ ఆధ్వర్యంలో ఇప్పటికే లబ్ధిదారులతో సచివాలయాలలో అర్జీలు అందజేసినట్లు చెప్పారు. దీనికి కొనసాగింపుగా పశ్చిమ తహసీల్దార్ కార్యాలయంలో అర్జీలు అందజేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. పేదలంతా తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు, మంగా శ్రీనివాసరావు, నగర నాయకులు జంగాల చైతన్య, కూరాకుల రాంప్రసాద్, బీవీఆర్ పాల్గొన్నారు.

తిట్టి, కొట్టి బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

లక్ష్మీపురం: ప్రార్థన వేడుకలకు హాజరైన పాస్టర్‌పై అకారణంగా ఓ వ్యక్తి గొడవ పెట్టుకుని తిట్టి, కొట్టి బెదిరించాడు. పాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. కడప జిల్లా దువ్వూరు మండలానికి చెందిన మనోహర్ పాస్టర్‌గా పని చేస్తూ ఉంటారు. గుంటూరు లాడ్జి సెంటర్‌లోని గాలిబాలి నివాసంలో జరిగిన ప్రార్థన వేడుకలకు హాజరయ్యాడు.ఈ సమయంలో బాలసుందర్ అనే వ్యక్తి కారణం లేకుండా గొడవ పెట్టుకుని తిట్టి, కొట్టి, అంతు చూస్తానంటూ బెదిరించాడు. దీంతో పాస్టర్ సుందరయ్య దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం చోరీపై కేసు నమోదు

లక్ష్మీపురం: షాపు ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఉదయం లేచి చూసే సరికి కనిపించక పోవడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన కాసా శ్రీనివాసరావు కరెంటు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. షాపులో పని చేసే తోటి స్నేహితుడు వాహనాన్ని తీసుకెళ్లాడు. అతడు పని ముగించుకుని రాత్రి 11 గంటలకు ఇంటి బయట వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. వెతికినా కనిపించక పోవడంతో గురువారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. పోసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి



లక్ష్మీపురం: అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బేషరతుగా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు లింగంశెట్టి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఏపీసీసీ పిలుపు మేరకు కోబాల్ట్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జ్ బిళ్లా సునీల్, ఇంతియాజ్, పాకనాటి సురేష్, పరిశుద్ధరావు, గుప్తా, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు పార్టీ నాయకులు పాల్గొని నినాదాలు చేశారు.

పడిపోయిన దేశ స్థూల దేశీయోత్పత్తి, వృద్ధి రేటు

లక్ష్మీపురం: గత నాలుగేళ్లలో పోల్చుకుంటే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి రేటు గణనీయంగా పడిపోయిందని విద్యావేత్త, విశ్లేషకులు ఈ.చంద్రయ్య అన్నారు. ఉత్పత్తి, సేవా రంగాల పనితీరు అధ్వానంగా ఉండటమే ఇందుకు కారణం అని పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జీడీపీపై చర్చా గోష్ఠిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి ఒక వైపు ఊదరగొడుతూ దేశ ప్రజలను భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రముఖ విశ్లేషకులు వి.వి.రావ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ఆదాని, అంబానీ వంటి కార్పొరేట్లకు మేలు చేసే నయా ఉదయావాద ఆర్థిక విధానాలే ఈ పరిస్థితికి కారణమని తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి



కెనడీ స్కూలులో విద్యార్థినుల సందడి

గుంటూరు ఎడ్యుకేషన్: తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పేర్కొన్నారు. చంద్రమౌళినగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న భాష్యం రామకృష్ణ మాట్లాడతూ చిన్ననాటి నుంచి విద్యార్థులకు మన కట్టుబొట్టు నేర్పించడం ద్వారా తెలుగు సంప్రదాయాల పై వారికి ఉన్నతమైన అభిప్రాయాలు ఏర్పడతాయని తెలిపారు. ఇందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాలని చెప్పారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భాష్యం బ్లూమ్స్, టాడ్లర్స్ క్యాంపస్‌లలో సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో ఉపాధ్యాయులు చిన్నారులకు భోగిపళ్లు పోశారు. రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు.

ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో ...

బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు, మామిడి తోరణాలు, చెరుకు గడలు, వెన్నకుండలతో అలంకరించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న యూనియన్ బ్యాంక్ డీజీఎం సయ్యద్ జవహర్, డాక్టర్ ఎన్. విజ్ఞత మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకుండా వేడుకలను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు వాటిని చాటి చెప్పవచ్చునని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎస్. ఫ్రాన్సిస్‌రెడ్డి, డైరెక్టర్లు విజయభాస్కరరెడ్డి, వైస్ చైర్మన్ ఆరోన్‌రెడ్డి, జోసఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనా బేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సుమేధ హైస్కూల్లో ..

ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులతో తీర్చిదిద్ది, గొబ్బెమ్మలతో అలంకరించారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్‌రెడ్డి భోగిమంట వేసి, చిన్నారులకు భోగిపళ్లు పోశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ రాంబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిషు మీడియం స్కూల్లో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో భోగి మంట వద్ద సంక్రాంతి గీతాలకు నృత్యంతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో వేసిన అందమైన ముగ్గులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు కె.శ్రీకాంత్‌బాబు, డాక్టర్ కె.శ్రీవిద్య, ప్రిన్సిపాల్ ఐజాక్, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాంటిస్సోరి స్కూల్లో..

■ లక్ష్మీపురం, శ్యామలానగర్‌లోని మాంటిస్సోరి ఇంగ్లిషు మీడియం స్కూల్ క్యాంపస్‌లలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణాన్ని రంగవల్లులతో తీర్చిదిద్ది, భోగిమంట వేసి కోలాటం ఆడారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత కేవీ సెబాస్టియన్, కరస్పాండెంట్ మంజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

■ పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో జరిగిన వేడుకల్లో పాఠశాల ప్రాంగణం పల్లెటూరి వాతావరణాన్ని తలపింపచేసింది. భోగిమంటలు, గొబ్బిళ్లు, గంగిరెద్దులాట, సంక్రాంతి లక్ష్మికి స్వాగతం పలుకుతూ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్లో వేడుకలు

విజ్ఞాన్ స్కూల్లో ..

ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్ మాట్లాడుతూ సకుటుంబ సపరివార సమేతంగా పండుగగా సంక్రాంతికి ప్రత్యేక స్థానముందని తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో ముగ్గులు వేసిన ఉపాధ్యాయినులు పొంగలి వండారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.



భోగిమంట వద్ద ఉపాధ్యాయులు, చిన్నారులతో భాష్యం రామకృష్ణ



ఆక్స్‌ఫర్డ్ స్కూల్లో సయ్యద్ జవహర్‌ను సత్కరిస్తున్న పాఠశాల డైరెక్టర్లు



సుమేధ హైస్కూల్లో భోగిమంట వద్ద ఉపాధ్యాయులతో చంద్రశేఖర్‌రెడ్డి



విజ్ఞాన్ స్కూల్లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయినులు

ముందస్తు సంక్రాంతి సంబరాల సందడి

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లెటూరి వాతావరణాన్ని తలపించే విధంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో ముగ్గులు వేశారు. బొమ్మల కొలువు, పతంగుల పోటీలు, భోగి మంట వేశారు. విద్యార్థులతో పాటు అధ్యాపకులు సంప్రదాయ వస్త్రధారణతో వేడుకల్లో పాల్గొన్నారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్ టి. హేమలతాదేవి, ఎస్. శైలజ విజేతలకు బహుమతులు అందజేశారు. సంబరాల్లో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, గౌరవాధ్యక్షుడు మన్నవ రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ ఎస్. మధుసూదనరావు, హిందూ డిగ్రీ కళాశాల ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ పి. సీతారామయ్య, ఏ. ప్రత్యూష, కల్చరల్ కమిటీ అధ్యాపకులు జి. ఇందిరా ప్రియదర్శిని, వి. మౌనిక, అధ్యాపకులు పాల్గొన్నారు.



భోగి మంట వేస్తున్న మన్నవ రాధాకృష్ణమూర్తి, జూపూడి రంగరాజు తదితరులు

ఎస్‌బీఐ సర్వీస్ పేరుతో ఖాతాలో రూ.62వేలు చోరీ

లక్ష్మీపురం: ఎస్‌బీఐ సర్వీస్ పేరుతో క్రెడిట్ కార్డు ద్వారా రూ.840 చార్జీలు పడుతున్నాయని, యాప్‌డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా చెప్పి ఖాతాలో ఉన్న రూ.62 వేలు చోరీ చేసిన ఘటనపై బాధితుడు నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండండ రామయ్య గర్‌కు చెందిన షేక్ కరీముల్లా అనే యువకుడికి డిసెంబర్ 17వ తేదీ మధ్యాహ్నం 8910415296 నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఎస్‌బీఐ సర్వీస్ నుంచి అని చెప్పి క్రెడిట్ కార్డు యాప్ ద్వారా రూ.840 చార్జీలు పడుతున్నాయని చెప్పారు. చార్జీలు పడకుండా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా చెప్పడంతో బాధితుడు చేశాడు. యాప్ ద్వారా వచ్చిన ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పాడు. దీంతో నిమిషాల వ్యవధిలో కరీముల్లా ఖాతాలో ఉన్న రూ.62 వేల నగదు ఆన్‌లైన్ ద్వారా చోరీ అయ్యాయి. దీంతో బాధితుడు తిరిగి ఫోన్ చేయగా ఫోన్ నంబర్ పని చేయలేదు. దీంతో బాధితుడు బ్యాంక్‌ల చుట్టూ తిరిగి ఫిర్యాదులు చేసిన ఎలాంటి స్పందన లేదు. దిక్కుతోచక నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు నష్టపరిహారం వెంటనే ప్రకటించాలి

కౌలు రైతుల సంఘం నాయకులు డిమాండ్

లక్ష్మీపురం: భాఈ వర్షాలకు నష్టపోయిన రైతులకు వెంటనే క్షపరిహారం వెంటనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఏఓకు కౌలు రైతుల సంఘ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల నివారణ సంస్థ 2024 నవంబర్ 7న ఈ నష్టాన్ని ఎన్యుమరేట్ చేయాలని ఐదు జిల్లాల కలెక్టర్లకు విజ్ఞప్తి చేస్తూ లెటర్ రాసిందని గుర్తుచేశారు. వెంటనే ఈ అంచనాకు ప్రత్యేక బాధ్యులను కేటాయించాలని కోరారు. నష్టాన్ని అంచనా వేసేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్పందించిన ఏఓ మాట్లాడుతూ వెంటనే నష్టాన్ని అంచనా వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు మనవ నాగమల్లేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంచుమాటి అజయ్ కుమార్, పఠాన్ ఇస్మాయిల్ ఖాన్, సీహెచ్. సురేష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరు ఆగదు

నాలుగో రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరహార దీక్షలు


లక్ష్మీపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రారంభమైన నిరాహార దీక్షలు గురువారంతో నాలుగో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.వి.యన్. కుమారి అధ్యక్షతన, ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజా మాట్లాడుతూ హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వకపోవడం వల్ల అంగన్‌వాడీల పని కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 105 సెంటర్లు ఖాళీగా ఉండటం వల్ల లక్ష్యాలు నెరవేరడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు బాధ్యతారాహితంగా ఉంటున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి జనవరి 10న జరిగే కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుండి వర్కర్లు హెల్పర్లు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాలుగో రోజు దీక్షల్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వి.వి.కె. సురేష్, ఎల్ఐసీ యూనియన్ మచిలీపట్నం డివిజన్ నాయకురాలు మధుబాల, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.పద్మ, ఎస్‌కే. బీబీ, చిన్న వెంకాయమ్మ, లక్ష్మీ, బాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, చింతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ రామ్మోహన్

రేపు ఆటోడ్రైవర్స్–వర్కర్స్ యూనియన్ మహాసభ


లక్ష్మీపురం: ఆటో డ్రైవర్స్–వర్కర్స్‌కు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కూరాకుల రాంప్రసాద్, మంగా శ్రీనివాసరావు కోరారు. స్థానిక కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన మిత్ర విడుదల చేయాలని, జీవో నంబర్ 21, 31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ ఈనెల 11న శనివారం ఉదయం సీపీఐ జిల్లా కార్యాలయంలో యూనియన్ 8వ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్స్–వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి హాజరవుతారని పేర్కొన్నారు. నగరంలోని ఆటో డ్రైవర్స్–వర్కర్స్ అంతా పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండీ. బాబర్ పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు

సామాజిక స్పృహ కలిగించే కథలు రావాలి

నగరంపాలెం: సామాజిక స్పృహ కలిగించే కథలు రావాలని ఏపీ హెచ్ఐవీ ఎయిడ్స్ కంట్రోల్ ఏడీ సరస్వతీదేవి అన్నారు. రెడ్ క్రాస్ కార్యాలయంలో మారుతి మహిళా సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కథల జాతీయస్థాయి పోటీల బహుమతి ప్రదానోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్‌పై ప్రజలను జాగృతి చేసేందుకు కథలు, కళారూపాల ద్వారా అవగాహన కలిగించాలని తెలిపారు. ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ హెచ్ఐవీ వైరస్ అవగాహనపై జాతీయ కథల పోటీలు నిర్వహించి, ఔత్సాహిక కథా రచయితలకు బహుమతులు అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రథమ బహుమతి (కరుణేషుదేవి) కథా రచయిత టి.వెంకటప్పయ్య, ద్వితీయ బహుమతి 'రత్తాలు' కథా రచయిత పి.వి. శేషారత్నం, తృతీయ బహుమతి 'పరివర్తన' కథ రచయిత శ్రీనివాసరావు, ప్రోత్సాహక బహుమతులను ముందు చూపు కథ రచయిత హైమావతి సత్య, చేతులు కాలాక కథ రచయిత డి.విశాలాక్షి, చీకటి దయ్యం కథ రచయిత ఎస్.ప్రవీణ్‌కుమార్‌లకు బహుమతులు అందించి సత్కరించారు. ప్రముఖ సినీ గేయ రచయిత శ్రీరసరాజు, జీజీహెచ్ పర్యవేక్షకులు రమణ యశస్వి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి. రామచంద్రరాజు, మారుతి మహిళా సొసైటీ అధ్యక్షురాలు లక్కంరాజు సునీత, సినీ నటులు నాయుడు గోపి పాల్గొన్నారు.



విజేతలతో అతిథులు

భక్తి శ్రద్ధలతో రామాయణ పారాయణలు



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం రామాయణ పారాయణలు, యుద్ధకాండ ఆనంద రామాయణం హోమాలు జరిగాయి. శ్రీమారుతి దేవాలయం, శ్రీరామ సేవా సమితి (వారణాసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామికి హారతి, నీరాజనం, మంత్రపుష్ప నిర్వహించారు. భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమాలను తంగిరాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అయ్యప్ప స్వాములకు సద్ది



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై పుష్య మాసం సందర్భంగా గురువారం ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, పాలకమండలి ఆధ్వర్యంలో జరిగాయి. ధార్మిక ప్రాంగణంలో అయ్యప్పలకు, మాలధారులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. తొలుత బొల్లేపల్లి లలితాంబ అయ్యప్ప స్వామికి హారతి, నైవేద్యం అనంతరం అయ్యప్ప నామస్మరణతో అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, పాలక వర్గం పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. సీనియర్ న్యాయవాది జి.శాంతకుమార్, టి.ఆనంద్‌శ్రీనివాసరావు, గీతా వాణి, మస్తాన్‌వలి, కాలే దేవదాసు, సన్నీ, అనీల్, కాలేషాభేగ్ రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. గుంటూరు బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు అమానుషంగా దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. స్టేషన్ సీఐ, ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా వారిపై వెనువెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



గుంటూరు జిల్లా కోర్టు ఎదుట నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

దక్షిణ భారత స్థాయిలోనూ సత్తా చాటాలి

గుంటూరు ఎడ్యుకేషన్: పుదుచ్చేరిలో ఈనెల 21 నుంచి 25 వరకు జరగనున్న దక్షిణ భారతదేశ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు గుంటూరు జిల్లా నుంచి ఎంపికైన విద్యార్థులు, గైడ్ టీచర్లను జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం డీఈవో కార్యాలయంలో అభినందించారు. విజయవాడలోని మురళి రిసార్ట్స్‌లో ఈనెల 7, 8వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ చూపిన విద్యార్థులు, ఉపాధ్యాయులు రూపొందించిన ప్రాజెక్టుల దక్షిణ భారతస్థాయికి ప్రదర్శనకు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమన్నారు. ఈసందర్భంగా నారాకోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ నజ్మా, ముట్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ దుర్గ, బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ హైస్కూల్ విద్యార్థినులు షేక్ అనీసాబేగం, ఎస్. ఈర్పిత, టీచర్ విభాగంలో జీజీపాలెం హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గవిని శ్రీనివాసరావుతో పాటు గైడ్ టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో గుంటూరు జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, హెచ్ఎంలు ఎన్. ఉషాకుమారి, గైడ్ టీచర్లు అరుణకుమారి, రామాంజనేయులు, ఆరిఫ్ బేగ్, శివారెడ్డి, భాస్కరరావు పాల్గొన్నారు.



09 వెస్ట్: 24- విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందిస్తున్న డీఈవో రేణుక

హాస్టల్స్ నిర్వహణ పక్కాగా ఉండాలి

నెహ్రూనగర్: సంక్షేమ హాస్టల్స్ నిర్వహణ పక్కాగా ఉండాలని సోషల్ వెల్ఫేర్ డీడీ డి. మధుసూదన్‌రావు హాస్టల్ వార్డెన్లకు సూచించారు. ఇటీవల ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భవతి అయి బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఇది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బుధవారం హాస్టల్స్ నిర్వహణపై సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి జూమ్ మీటింగ్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం జేకేసీ కాలేజ్ ఆఫ్ లాలో గుంటూరు జిల్లాలోని హెచ్‌డబ్ల్యూఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్ నిర్వహణకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బాలికల హాస్టల్‌లో వార్డెన్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎలీనా రాయ్‌కు చోటు

గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో యూకేజీ చదువుతున్న కడియం ఎలీనా రాయ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఐదేళ్ల 33 రోజుల వయసులో గరిష్ట సంఖ్యలో 95 ప్రత్యామ్నాయ ఫుట్‌రోప్ స్కిప్‌లను 30 సెకన్లలో ప్రదర్శించినందుకు రికార్డు సాధించినట్లు వివరించారు. అతి పిన్న వయసులోనే పెద్ద విజయాన్ని అందుకున్న చిన్నారి భవిష్యత్తులో మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గసభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, హైస్కూల్, ప్రైమరీ ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

